# అమ్మకూ..నాకూ..మధ్య...

గోగిశెట్టి చెంచు మోహన్‌నాయుడు

**ఢిల్లీ నుండి బయలుదేరిన తమిళనాడు ఎక్స్‌ప్రెస్ చాలా వేగంగా చెన్నైవైపు దూసుకుపోతోంది. అందులో ప్రయాణిస్తున్న నా ఆలోచనలు కూడా అంతకన్నా వేగంగా మా వూరివైపు, ఊళ్ళో వుంటున్న మా అమ్మవైపు పరుగులు తీస్తున్నాయి.**

**దాదాపు సంవత్సరం తరువాత మా అమ్మను చూడబోతున్నాననీ, అమ్మ చేతివంట తినబోతున్నాననీ తలుచుకుంటేనే మనసు ఆనందంతో ఉక్కిరిబిక్కిరవుతోంది.**

"గువ్వలా ఎగిరిపోవాలీ.. నా తల్లి గూటికే చేరుకోవాలి.. లీ.. లీ" అంటూ అమ్మకోసం సినిమాలో హీరో కృష్ణలా పాట పాడుతూ గంతులు వెయ్యాలనుంది. కానీ నేనుండేది రైల్లో కదా.

మా ఆమ్మ! ఎంత మంచి అమ్మ. నా కోసం ఎన్నికష్టాలు పడింది. ఎన్ని అవమానాలు భరించింది. ఎన్ని నిందలు మోసింది.

అమ్మకు నేనంటే ప్రాణం. ఒక ప్రాణం కాదు, పంచ ప్రాణాలు. ఆ పంచ ప్రాణాలూ నా మీదే పెట్టుకుని అమ్మ ఇన్నాళ్ళూ బ్రతికింది. ఇంకా బ్రతుకుతూ వుంది.


అటువంటి అమ్మకోసం తనేం చేశాడు? హాయిగా ఢిల్లీలో ఉద్యోగం చేసుకుంటూ పెళ్ళాం పిల్లలతో కులాసాగా గడుపుతూ, ఆమెనేమో దిక్కులేని దాన్నిలా ఆ పల్లెటూళ్ళో ఒక్కదాన్నీ వదిలేసాడు.

అసలు అమ్మను ఎట్లా చూసుకోవాలనుకున్నాను? ఎంతగా సుఖ పెట్టాలనుకున్నాను? నాకు ఉద్యోగం వచ్చిన తరువాత అమ్మను నా దగ్గరే ఉంచుకుని, సకల సౌకర్యాలు కలుగజేసి కాలు కిందపెట్టే అవసరం లేకుండా మహారాణిలా చూసుకోవాలని ఎన్ని కలలు కన్నాను. ఆమె ఇన్నాళ్ళూ పడ్డ కష్టాలు అన్నీ మరచిపోయేలా ఆమెను సంతోష పరచాలనుకున్నాను. కానీ, తీరా ఉద్యోగం వచ్చి పెళ్ళయి పెళ్ళాం వచ్చాక ఏమీ చేయలేకపోయాను. నా కలలన్నీ కల్లలైపోయాయి. కారణం నా భార్య రేఖ.

రేఖకు అమ్మంటే గిట్టదు. మా అమ్మను తీసుకొచ్చి మన దగ్గరే ఉంచుకుందాం అని నేను అన్నప్పుడల్లా "ఆ ముసల్దానికి నేను చాకిరీ చేస్తూ వండి వార్చుతుండాలా! ఆ ముసల్దాన్ని చూస్తేనే నాకు అసహ్యం. ఇక జీవితాంతం దానితో కలిసి మెలిసి వుండాలంటే నా వల్లకాదు" అంటూ నిర్మొహమాటంగా చెప్పింది. నేను కొట్టాను. అంతే, అన్నం తినకుండా అలిగేది. నన్ను పట్టించుకునేది కాదు. ఎంత చెప్పినా వినేది కాదు. మొండిగా ప్రవర్తించేది. ఇక లాభం లేదనుకొని వదిలేశాను.

ఒకవేళ అమ్మను నేను రమ్మన్నా ఆమె వచ్చేది కాదులే. ఎందుకంటే ఆమెకు తెలుసు తన కోడలి గురించి. పెళ్ళప్పుడే ఆమె రేఖ మనస్తత్వం తెలుసుకుంది. మా అమ్మకు చదువు రాదు గాని మనుషులను చదవడం బాగా తెలుసు.

నా చిన్నప్పుడే.. అంటే నాకు పదేళ్ళ వయసులోనే మా నాన్నగారు చనిపోయారు. ఒక్కగా



నొక్క కొడుకునైన నాకు అమ్మా, నాన్న అన్నీ అమ్మే అయి పెంచింది. మా నాన్న మిగిల్చిన ఆస్తికూడా ఏమీ లేదు. పేకాట పిచ్చితో వున్న ఆస్తినంతా కాజేశాడంట.

నాకింకా ఆ రోజులు బాగా గుర్తు. అమ్మ పొద్దున్నే కూలిపనికి వెళ్ళేది. వరినాట్లు, కలుపు, కోతలు ఇలా ఏ పనికైనా సరే వెళ్ళేది. పనికెళ్తూ అన్నం వండి పెట్టి వెళ్ళేది. నేను బడికెళ్ళొచ్చి అన్నం తినేవాణ్ణి. అమ్మ సాయంకాలానికి వచ్చేది.

కూటికి తక్కువైనాముగాని కులానికి తక్కువ కాకపోతిమి. కూలికి పోతుందని సాటి కులస్తులు మా అమ్మను ఎగతాళి చేసేవాళ్ళు. ముఖ్యంగా ఆడవాళ్ళు. అయితే ఇలాంటి ఎగతాళి మాటలను అమ్మ పట్టించుకునేది కాదు. తన పనేదో తాను చేసుకుపోతుండేది.

కానీ, ఒకసారి ఒక విషయంలో మాత్రం అమ్మ చలించిపోవడం నేను చూశాను. మా చుట్టాలామె ఒకామె ''ఒరేయ్ కాదురా మోహనా! మీ అమ్మ అల్లా కాపోల్ల వెంకట్రావును ఉంచుకుందంట కదరా'' అని అడిగింది. ఉంచుకోవడం అంటే ఏమిటో అప్పుడు నాకేం అర్థం కాలేదు.

సాయంత్రం మా అమ్మ పని నుండి వచ్చిన వెంటనే ''ఏమ్మా నువ్వెవర్నో ఉంచుకున్నావంటగా? ఉంచుకోవడం అంటే ఏమిటమ్మా'' అంటూ అమాయకంగా ప్రశ్నించాను.

''ఎవర్రా నీకు చెప్పింది?'' అంటూ కోపంగా అడిగింది అమ్మ.

అమ్మ అంత కోపంగా వుండటం నేనెప్పుడూ చూడలేదు. ''మన రమణత్తమ్మా'' అని చెప్పాను.

వెంటనే అమ్మ నన్ను రమణత్త గారింటికి లాక్కుపోయి ఆమెను అడిగింది ''ఏం వదినా! నేనెవర్నో ఉంచుకున్నానని మా వాడికి చెప్పావంట. నిజమేనా'' అని.

''నిజమో, అబద్ధమో నాకేం తెలుసు? ఊళ్ళో అందరూ అనుకుంటుంటే నేనూ అన్నాను'' అందామె.

అమ్మ కోపంతో ఊగిపోతూ ఆమెను ఏదో గట్టిగా అడుగుతోంది. ఆమె కూడా ఏదో ఇంకా గట్టిగా అరుస్తూ చెబుతోంది. నాకేం అర్థం కావటంలేదు. కాసేపటికి గొడవ అయిపోయాక ఇంటికెళ్ళాం. అమ్మ మౌనంగా వుంది. పొద్దుగూకినా వంటా గింటా మొదలు పెట్టలేదు. అమ్మ అలా వుండటం చూసి నాకు భయమేసింది. ''ఏందమ్మా అట్లాగున్నావ్? మాట్లాడమ్మా'' అన్నాను.

''ఒరేయ్! నాకు ఈ క్షణమే చచ్చిపోవాలనుందిరా. కానీ నువ్వు అడ్డుపడుతున్నావురా. ఇంత నిందమోసి కూడా నేను ఇంకా బ్రతకాలనుకుంటున్నానంటే నిన్ను చూసేరా. నీకోసమే బ్రతుకుతాను.. నీకోసమే బ్రతుకుతాను'' అంటూ లేచి వంటచెయ్యడం మొదలుపెట్టింది.

ఆ రాత్రికి అమ్మ ఏం ఆలోచించిందో ఏమో గాని, తెల్లవారగానే నన్ను మా ఊరికి దగ్గర్లో వున్న ఒంగోలులోని హాస్టల్‌లో చేర్పించి అక్కడే చదువుకోమంది.

హాస్టల్‌లోనే వుండి చదువుకున్నాను. సెలవులు ఇచ్చినపుడు మాత్రం ఇంటికి వచ్చేవాణ్ణి. పదవ తరగతి పాసయ్యాను. అట్లాగే ఇంటర్, డిగ్రీకూడా పూర్తిచేశాను. తరువాత యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమీషన్ వారు నిర్వహించిన గ్రూప్ ఫోర్ పరీక్షలు రాయగా, సి.బి.ఐ ఆఫీస్‌లో జూనియర్ క్లర్క్‌గా ఉద్యోగం వచ్చింది. ఢిల్లీలో పోస్టింగ్ ఇచ్చారు.

అప్పుడు చూశాను అమ్మ కళ్ళల్లో మెరుపు. నాకు ఎవరెస్ట్ శిఖరం ఎక్కినంత ఆనందం కలిగింది ఆ మెరుపు చూసి.

''నాయనా నా కష్టానికి ఫలితంరా నువ్వు. నా కష్టం బూడిద పాలు కాకుండా చేసినావు. ఇంకేం కావాలయ్యా నాకు. ఫలానా రాములమ్మ కొడుకు ఢిల్లీలో ఉద్యోగం చేస్తున్నాడు అని ఊళ్ళో అందరూ అనుకుంటుంటే గర్వంగా ఊళ్ళో తిరుగుతాను. నన్ను ఆడిపోసుకున్న అమ్మలక్కలంతా నన్ను చూసి కుళ్ళి కుళ్ళి ఏడుస్తుంటే సంబరపడిపోతాను'' అంటూ ఎంతో సంతోషంతో నన్ను ఢిల్లీకి సాగనంపింది.

* * *

''డాడీ.. డాడీ..'' అంటూ నా కొడుకు, కూతురు తట్టిలేపేసరికి ఆలోచనల్లోంచి ఇవతలకొచ్చాను.

''ఏంటి డాడీ.. అంత దీర్ఘంగా ఆలోచిస్తున్నారు'' అన్నాడు నా కొడుకు లక్ష్మణ్.

''ఆ.. వాళ్ళమ్మ గురించి అయి వుంటుందిలేరా'' అంది రేఖ.

''అవునా నాన్నా'' అన్నాడు లక్ష్మణ్.

''అవున్రా. మా అమ్మగురించే ఆలోచిస్తున్నాను. ఆమె నా కోసం పడ్డ కష్టాలు, బాధలు, అవమానాలు అన్నీ గుర్తుకొస్తున్నాయిరా. నానమ్మ ఊరికి వస్తున్నట్లు రాసిన లెటర్ చేరి వుంటుంది కదా. ఇక కనపడ్డ వాళ్ళందర్నీ అడుగుతూ వుంటుంది పన్నెండో తారీఖు ఎప్పుడూ అని'' అన్నాను.

ఇంతలో నా కూతురు రమ కల్పించుకొని ''నాన్నా! అసలు నానమ్మ ఢిల్లీలో మన దగ్గరే వుండక ఆమె ఒక్కతే ఆ ఊళ్ళో ఏం చేస్తుంటుంది. మనతో పాటే తీసుకెళ్దాం'' అంది.

నేను రేఖవైపు చూశాను దీనికి ఏం సమాధానం చెబుతావో చెప్పు అన్నట్లు. ఆమె ముఖం తిప్పుకుంది.


రమతో అన్నాను ''నానమ్మకు ఢిల్లీ అంటే ఇష్టం లేదంటమ్మా. తను పుట్టి పెరిగిన ఆ పల్లెటూరే ఇష్టమంట. అందుకని అక్కడే ఉంటానంది. మీరు పెద్దయిన తరువాత నానమ్మకు నచ్చజెప్పి మనతోపాటే తీసుకువద్దురుగాని'' అని.

ఇంతలో ఒంగోలు స్టేషన్ రానే వచ్చింది. ఒంగోల్లో రైలు దిగాక మరో రెండు బస్సులు మారి మా ఊరికి చేరుకున్నాం. నాకు తెలుసు.. మా అమ్మ మాకోసం మా ఊరి బస్టాండ్‌లో ఎదురుచూస్తూ వుంటుందని.

నేను బస్ దిగుతూ చూశాను. అదిగో అమ్మ.

## బికినీలపై లక్ష్మీదేవి!!!

పశ్చిమ దేశాల డిజైనర్లకు భారతదేశమంటే ఎప్పుడూ చులకనే. అందునా మన దేవతలన్నా సంప్రదాయాలన్నా చాలా చిన్న చూపు. ఆమధ్య చెప్పులపై గణపతి బొమ్మను ముద్రించి అమ్మారు. ఇప్పుడు మళ్లీ అలాంటిదే మరో సంఘటన వెలుగు చూసింది. లండన్‌కు చెందిన దుస్తుల డిజైనర్ రాబర్ట్ కవల్లీ బికినీలపై మన లక్ష్మీదేవి బొమ్మలు ముద్రించి జోరుగా అమ్మకాలు సాగించాడు. రాబర్ట్ డిజైన్‌చేసే దుస్తులు చాలా సెక్సీగా, రెచ్చగొట్టేవిధంగా ఉంటాయి. అయితే అతను ఎప్పుడు ఇలా మరొకరి మనోభావాలను దెబ్బతీసే పనులు మాత్రం చేయలేదు. ఇప్పుడు ఏకంగా సమ్మర్ కలెక్షన్ అంటూ మన ఆరాధ్య దైవాన్ని అంగడిబొమ్మను చేశాడు. హిందూ హ్యూమన్ రైట్స్ ఈ అంశాన్ని చాలా తీవ్రంగా తీసుకుంది. తన నిరసనను అన్ని వేదికలమీద ప్రకటించింది. దానితో రాబర్ట్ తగ్గాడు. క్షమాపణ తెలిపాడు.



చెట్టుకింద నిలబడి వుంది. నన్ను చూసి నా వైపుకు పరిగెత్తుకుంటూ వస్తోంది. పిల్లలు, రేఖ బస్ దిగారో లేదో అని పట్టించుకోక మా అమ్మవైపే చూస్తూ నిల్చున్నాను.

''ఏవండీ! మీరు బస్ దిగగానే సరిపోయిందా? పిల్లల్ని మెల్లగా దించండి. ఇవిగో ఈ సూట్‌కేసులు పట్టుకోండి'' అంటూ రేఖ పిలిచేసరికి తప్పనిసరై పిల్లల్ని జాగ్రత్తగా దించి రేఖ చేతిలోని సూట్‌కేస్‌లను అందుకుని కిందకు వచ్చేశాను. దుమ్ము రేపుకుంటూ బస్ వెళ్ళిపోయింది.

ఈలోపు అమ్మ నాదగ్గరకొచ్చింది. నావైపు ఆత్మీయంగా చూస్తూ నిల్చుంది. ఎందుకో అమ్మను ఒక్కసారి కావులించుకోవాలనిపించింది. అనుకోకుండా దుఃఖం ముంచుకొచ్చింది. నా కళ్ళల్లో నీళ్ళు తిరుగుతున్నాయి. అమ్మా! అంటూ ఒక్కసారిగా కావులించుకున్నాను చిన్నపిల్లాడిలా. అమ్మ స్పర్శలోని వాత్సల్యం నాకేదో తెలియని హాయిని కలిగించగా.. ''ఏమ్మా! బావున్నావా?'' అన్నాను.

''బాగున్నాను నాయనా. నువ్వు బాగున్నావా'' అంటూ నా ముఖాన్ని తన చేతులతో తడుముతూ వుంది. ఆమె కళ్ళకు నేనింకా పదేళ్ళ పిల్లాడినే అనిపిస్తూంటుంది. చుట్టూ ఉండి చూసే వాళ్ళకి ఇది అతిగా అనిపించొచ్చు. కానీ ఎవరికోసమో నేను నా అనుభూతుల్ని వదులుకోలేను గదా.

**ఆమె ఒళ్ళో తల పెట్టి పడుకున్నాను. చిన్నపిల్లాణ్ని అయిపోయాను. అమ్మ నా తల నిమురుతూ ఏదో చెబుతోంది. ఆమె చెప్పే మాటలు నాకు జోలపాటలా వినపడి కమ్మగా నిద్రపోయాను. పిల్లలొచ్చి లేపేదాకా అమ్మ ఒళ్ళోనే నిద్రపోయాను. ఎంత ప్రశాంతంగా వుంది! అమ్మ ఒడి దేవుడి గుడి అని ఎందుకన్నారో అర్థమైంది.**

తన మనవడిని, మనవరాలిని ముద్దాడింది. ''ఏమ్మా! బాగున్నావా?'' అంటూ కోడలిని పలకరించింది. నా కొడుకు కూతురు కూడా మా అమ్మతో బాగా కలిసిపోతారు. ఇక్కడున్నన్నాళ్ళూ నానమ్మా నానమ్మా అంటూ ఆమెవెంటే తిరుగుతూ వుంటారు. నాలాగే వాళ్ళు కూడా సంక్రాంతి పండుగ ఎప్పుడొస్తుందా, నానమ్మ దగ్గరికెప్పుడెళ్దామా అంటూ ఆత్రుత పడుతూ వుంటారు. బహుశా రక్త సంబంధం అంటే ఇదేనేమో.

బస్టాండ్ నుంచి ఊళ్ళోకెళ్ళాలంటే ఓ ఫర్లాంగు దూరం నడవాల్సి వుంటుంది. ఇంట్లోకి అడుగుపెట్టామో లేదో నా కొడుకు కూతురు ''నాయనమ్మా మాకు అరిసెలు పెట్టవూ'' అంటూ అమ్మ దగ్గరికి చేరారు.

''పెడతానర్రా. చేసింది మీకోసమేగా'' అంటూ పైన చెక్కమీద పెట్టిన టిఫిన్ లోంచి అరిసెలు తీసి పిల్లలకిచ్చింది.

''ఇవిగోనమ్మా నువ్వుకూడా తిను'' అంటూ రేఖకు ఇవ్వబోగా.. ''నాకు ఇప్పుడు వద్దు. తర్వాత తింటాన్లే'' అంది.

''ఇటివ్వమ్మా నేను తింటాను'' అని నేను అరిసెలు తీసుకుని తిన్నాను. వీటికి ఇంత కమ్మదనం ఎలా వచ్చిందబ్బా? బహుశా అమ్మ తన ''అమ్మతనం'' కలిపి చేసుండొచ్చు.

తెల్లవారితే భోగి పండుగ. భోగిమంటకు కావలసిన రేగికంప, ఎండిపోయిన తాటాకులు మొదలైన వాటిని అమ్మ సిద్ధం చేసి ఉంచింది. తెల్లవారు ఝామున నాలుగు గంటలకే అందరూ నిద్రలేచారు. భోగిమంటలు వేశారు. ఊరు ఊరంతా భోగిమంటల సందడితో వెలిగిపోతోంది. ఆ నిప్పుల్లోనే నీళ్ళు కాచుకుని అందరూ తలస్నానాలు చేశారు.

అమ్మ ఒక్కతే బిందెతో నీళ్ళు తెస్తూనే వుంది. రేఖ అలా ఊరికే కూర్చుని వుంది. కనీసం మాటవరసకైనా నేనూ తెస్తాన్లే అత్తయ్యా అని అనలేదు. చదువుకున్నామంటారేగానీ సంస్కారం వుండదు. ముసలామె ఒక్కతీ బోరింగ్ దగ్గరనుండి నీళ్ళు కొట్టుకుని తీసుకువస్తుంటే చూస్తూ ఎలా కూర్చుని వుండబుద్ధి అవుతుందో? కనీసం వయసునన్నా గౌరవించాలని ధ్యాస వుండదు.

ఆరోజే కాదు, మేమున్న వారం రోజులు ఇంటి పని, వంటపని అన్నీ అమ్మే చేసింది. ఆమె దగ్గరికి మేం రావడమే మహాభాగ్యం అయినట్లు, మాకు చాకిరీ చెయ్యడమే ఆమెకో వరం అయినట్లు భావిస్తుందామె.

ఏడు రోజులవూ ఏడు నిముషాల్లా గడిచిపోయాయి అమ్మ అనురాగపు నీడలో, ఆప్యాయతల మేడలో, వాత్సల్యపు ఒడిలో.

మళ్ళీ సంవత్సరానికిగానీ అమ్మను చూడలేను. ఢిల్లీ నుండి వచ్చేటప్పుడు ఎంత సంతోషంగా వస్తానో తిరిగి వెళ్ళేటప్పుడు అంత బాధగా వెళ్ళవలసి వస్తుంది. ఐదారేళ్ళుగా ఇది నాకు అలవాటైంది.

పిల్లలు బయట ఆడుకుంటున్నారు. రేఖ చుట్టాలింటికి వెళ్ళింది. అమ్మ, నేను మాత్రమే ఇంట్లో వున్నాం. మెల్లిగా అమ్మదగ్గర కెళ్ళి కూర్చున్నాను. ''అమ్మా! నామీద నీకు కోపంగా లేదంటమ్మా'' అన్నాను.

''ఎందుకయ్యా'' అంది.

''నిన్నొక్కదాన్నే ఇక్కడొదిలేసి వెళుతున్నందుకు'' అన్నాను.

''దానికి నువ్వేం చేస్తావయ్యా? కోడలు పిల్ల పడనీయొద్దూ. నిదానంగా తనే తెలుసుకుంటుంది. అప్పుడు అందరం కలిసి ఉందాం. నా గురించి దిగులు పడుతూ నీ మనసు పాడుచేసుకోవద్దు నాయనా. నా కట్టె ఈడుందేగాని నా ప్రాణమంతా మీదగ్గరే వుంటుందిరా. ఈ దూరాభారాలు మనుషులకి గాని మనసులకి కాదురా'' అంది.

అమ్మ ఎంత కరెక్టుగా చెప్పింది. నిజంగా అమ్మకు చదువు రాదేమోగాని జీవితాన్ని చదివింది. దూరభారాలు మనుషులకే గాని మనసులకు కాదు అని ఎంత చక్కగా చెప్పింది. వాస్తవానికి నేను ఢిల్లీలో వున్నాననేగాని అమ్మని తలచుకోని రోజుందా, అమ్మను గుర్తు చేసుకోని రోజుందా? అమ్మ ఎప్పుడూ నా మనసులోనే వుంటుంది కదా.

''అమ్మా! నాకు నీ ఒళ్ళో పడుకోవాలనుందే'' అన్నాను.

''పడుకోయ్యా'' అంది.

ఆమె ఒళ్ళో తల పెట్టి పడుకున్నాను. చిన్నపిల్లాణ్ని అయిపోయాను. అమ్మ నా తల నిమురుతూ ఏదో చెబుతోంది. ఆమె చెప్పే మాటలు నాకు జోలపాటలా వినపడి కమ్మగా నిద్రపోయాను.

పిల్లలొచ్చి లేపేదాకా అమ్మ ఒళ్ళోనే నిద్రపోయాను. ఎంత ప్రశాంతంగా వుంది! అమ్మ ఒడి దేవుడి గుడి అని ఎందుకన్నారో అర్థమైంది.

ఢిల్లీకి బయలుదేరే టైమయింది. సూట్‌కేసులు బ్యాగులు అన్నీ సర్దాము. అమ్మ మా కోసం చేసిన అరిసెలు, కజ్జికాయలు పెద్ద మూట కట్టింది.

బస్టాండ్ కొచ్చాం. బస్ వచ్చే టైమయింది. మనసంతా బరువెక్కి పోయింది. ఈ బరువును మళ్ళీ సంవత్సరం దాకా మోయాలి.

అమ్మ పరిస్థితి కూడా ఇట్లాగే వుంటుంది కాబోలు? కానీ పైకి ఎంతగా గంభీరంగా వుంది! మనవడితో మనవరాలితో ముచ్చట్లాడుతోంది. వాళ్ళకు ముద్దులు పెడుతోంది.

బస్ వస్తున్నట్లు హారన్ మోగింది. నా గుండెల్లో మోగినట్లైంది. అమ్మ వైపు చూశాను. అమ్మ కూడా నా వైపు చూసి తల దించుకుంది. ఆమె కళ్ళల్లో తడిని నేను గమనించాను.

బస్ వచ్చి ఆగింది. రేఖ, పిల్లలు ఎక్కారు. తెలిసిన వాళ్ళెవరో బ్యాగులు, సూట్‌కేస్ బస్‌లో పెట్టారు. అమ్మ నా దగ్గరకు వచ్చింది. నన్ను గట్టిగా కావులించుకుని నా నుదుటిమీద ముద్దుపెడుతూ ''జాగ్రత్త నాయనా'' అంది.

నా నోటికి మాటలు రావడం లేదు.

''నువ్వు...జా...గ్ర...త్త...మ్మా'' అంటూ అస్పష్టంగా పలుకుతూ అప్రయత్నంగా బస్ ఎక్కాను. బస్ బయలుదేరింది. తలుపు దగ్గరే నిలబడి కిటికీలోంచి తల బయటపెట్టి అమ్మనే చూస్తూ చేయి ఊపుతున్నాను. కిటికీలోనుండి పిల్లలు కూడా అమ్మకు చేతులు ఊపుతూ టా..టా.. చెబుతున్నారు. అమ్మకూడా చెయ్యి ఊపుతూ నిల్చుని వుంది.

బస్ రేపుతున్న దుమ్ముకు అమ్మ ముఖం కనిపించలేదు. నాకు తెలీకుండానే కళ్ళల్లో నీళ్ళు ఉబుకుతున్నాయి. వాటిని తుడుచుకుంటూ సీట్లో కూర్చున్నాను. బస్ భారంగా ఆ మట్టిరోడ్డుపై పోతోంది అచ్చం నాలాగే.

అమ్మకూ నాకూ మధ్య అడ్డుగా ఒక రేఖ. ఆ రేఖ నా 'రేఖ' కావడం నా దౌర్భాగ్యం. రేఖలో మార్పు వచ్చి ఈ సారి సంక్రాంతికి వచ్చినప్పుడైనా అమ్మను నాతోపాటు తీసుకెళ్ళాలి అని గట్టిగా కోరుకుంటూ 'దేవుడా! నా ఈ కోరికను తీర్చవయ్యా' అంటూ గుర్తుకొచ్చిన దేవుళ్ళందర్నీ పేరు పేరునా మొక్కుకుంటూ మెల్లగా కళ్ళు మూసుకున్నాను.

★